క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

రుద్రవరం: మండలంలోని కొండమాయపల్లె పంచాయతీ మజరా వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ,గోదా సమేత వాసాపురం వేంకటేశ్వర స్వామి వారికి ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఓ శుభ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన ముందుగా స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయం వద్దకు వచ్చిన ఆయనకు నిర్వాహకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రథమనందిలో డీఎస్పీ ప్రత్యేక పూజలు



అభిషేకం నిర్వహిస్తున్న డీఎస్పీ

నంద్యాల(వ్యవసాయం): కార్తీకమాసాన్ని పురస్కరించుకొని నంద్యాల ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ రామాంజులునాయక్ ఆదివారం ప్రథమనంది దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ప్రథమనందీశ్వరుడికి, కేదారేశ్వరి మాతకు పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆలయ అర్చకులు ఆయనను సన్మానించి స్వామి వారికి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.శ్రీనివాసరెడ్డి, చలంబాబు, రామశివారెడ్డి, శైలేంద్రనాథరెడ్డి, సుధాంశరెడ్డి, విజయేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌బీకేకు తుది మెరుగులు



బుర్రారెడ్డిపల్లె గ్రామంలో నిర్మించిన ఆర్‌బీకే

దొర్నిపాడు: మండలంలోని బుర్రారెడ్డిపల్లె గ్రామంలో నిర్మిస్తున్న వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం తుదిమెరుగులు దిద్దుకుంటోంది. ఇప్పటికే పనులు పూర్తి చేసుకున్న కేంద్రం కేవలం రంగులు, పేర్లు రాయాల్సి ఉంది. రూ.21.80 లక్షలతో నిర్మాణం పూర్తి చేశారు. ఇప్పటికే క్రిష్టిపాడు, దొర్నిపాడులో రెండు కేంద్రాలను ప్రారంభిచారు. డబ్ల్యూ గోవిందిన్నె, డబ్ల్యూ కొత్తపల్లె, గుండుపాపల గ్రామాల్లో నిర్మాణ దశలో ఉన్నట్లు పంచాయతీరాజ్ ఏఈ కొండారెడ్డి తెలిపారు. కొండాపురంలో ఇంకా పనులు ప్రారంభం కావాల్సి ఉందని చెప్పారు.

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయమే అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు.పలువురు భక్తులు అమ్మవారికి కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

విద్యార్థులకు క్రీడాపోటీలు



త్రోబాల్ పోటీల్లో పాల్గొన్న బాలికలు

దొర్నిపాడు: గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం గ్రంథాలయాధికారి అఖిలబేగం విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. చెస్, క్యారమ్స్, బాస్కెట్ బాల్, త్రోబాల్ పోటీలు ఏర్పాటు చేశారు. అనంతరం బాలికలకు నృత్య పోటీల అనంతరం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు జయలక్ష్మి, నరసయ్య పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

నంద్యాల(వ్యవసాయం): రోటరీ క్లబ్ ఆఫ్ నంద్యాల ఆధ్వర్యంలో పరివర్తన లైఫ్ సెంటర్‌లోని పిల్లలకు దుప్పట్లను ఆదివారం పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు దండె దస్తగిరి మాట్లాడుతూ రూ.10వేల విలువజేసే దుప్పట్లను గంట రాజేష్‌కుమార్‌రెడ్డి జ్ఞాపకార్థంగా అందజేశామన్నారు. సభ్యులు శీను, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ నాగన్న, ఎల్.కాంతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాలధారులకు వస్త్రాల అందజేత

నంద్యాల(వ్యవసాయం): సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భవానీ దీక్షదాలకు ఆదివారం వస్త్రాలు అందజేశారు. ఫౌండేషన్ నాయకుడు చింతలపల్లె వాసు మాట్లాడుతూ పది మంది మాలధాలకు దాతలు సాంబారపు నాగప్రసాద్, అనఘా, బైరెడ్డి వెంకటరెడ్డి, లోకేశ్వరరెడ్డి సహకారంతో వస్త్రాలు అందజేశామని చెప్పారు.

కార్తీకం.. శైవ క్షేత్రాలు సిద్ధం



శ్రీశైలం దేవాలయం,



మహానంది ఆలయ ఆవరణ



యాగంటి నందీశ్వరుడు



భోగేశ్వరస్వామి

- సోమవారాల్లో లక్షల్లో భక్తుల రాక
- ఏర్పాట్లు పూర్తి చేసిన దేవదాయ శాఖ
- కులసంఘాలు, స్వచ్ఛంద సంస్థలతో భోజన వతి ఏర్పాటు
- ప్రత్యేక బస్సులు నడువుతున్న ఆర్టీసీ

నంద్యాల(వ్యవసాయం): కార్తీకం శివకేశవులకు ప్రీతికరమైనది. దీంతో ఈ మాసాన్ని విశిష్టమైనదిగా భావిస్తారు. తెల్లవారుజామునే నదీ స్నానాలు చేయడం, కార్తీక దీపాలు వెలిగించడం, వనభోజనాలు ఈ మాసం ప్రత్యేకత. నెల రోజుల పాటు జిల్లాలోని శైవక్షేత్రాలు శివ నామస్మరణతో మారుమోగుతాయి. శ్రీశైలం, మహానంది, యాగంటి, భోగేశ్వరం, రుద్రకోడూరు, ఓంకారం, గుండ్లబ్రహ్మేశ్వరం, ముచ్చెట్ల, కొత్తూరు, నవనందులు తదితర ఆలయాల్లో కార్తీక మాసంలో నిత్యపూజలతో పాటు విశేష, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆయా క్షేత్రాల్లో కార్తీక మాస మహోత్సవాలకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. శివయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించడానికి సర్వం సిద్ధం చేశారు. అభిషేకాలు, లక్షదీపాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషకాలు, రుద్రహోమాలు, ప్రత్యేక అలంకరణ పూజలు, జ్వాలాతోరణం, కార్తీక దీపారాధనలు జరిస్తారు. అలాగే..స్వామి వారి కల్యాణం, రథోత్సవం, వాహన సేవలు చేపడతారు. నంద్యాల జిల్లాలో పది క్షేత్రాలకు పైగా ప్రముఖ శైవ క్షేత్రాలు ఉన్నాయి. కార్తీక మాసం నెల రోజులు ఈ క్షేత్రాలను దర్శించడానికి జిల్లా, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతోపాటు కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తారు. ప్రతి సోమవారం శ్రీశైలం క్షేత్రంలో దర్శనానికి దాదాపు 50వేల నుంచి లక్ష మంది వరకువచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు. మిగిలిన రోజుల్లో 20వేల నుంచి 40వేల మంది భక్తులు వస్తుంటారు.

ఏర్పాట్లు పూర్తి..

శ్రీశైలంతో పాటు ప్రముఖ శివాలయాల్లో కార్తీక మాసం మహోత్సవాల సందర్భంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉచిత దర్శనం క్యూలైన్లు, ప్రత్యేక దర్శనం క్యూలైన్లు, చలువ పందిళ్లు, విద్యుత్, దీపాలంకరణతో పాటు భక్తులకు తాగునీరు, బాత్‌రూంలు, విశ్రాంతి ప్రదేశాలు ఏర్పాటు చేశారు.

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు..

జిల్లాలోని శైవక్షేత్రాలను దర్శించుకోవడానికి ఆర్టీసీ ఆయా డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడపడానికి చర్యలు చేపట్టింది. గ్రూపులుగా ఏర్పడి శైవక్షేత్రాలకు వెళ్లే వారి కోసం ప్రత్యేక ప్యాకేజీలను సైతం రూపొందించామని ఆర్‌ఎం శ్రీనివాసులు తెలిపారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం



జిల్లాలోని శ్రీశైలం, మహానందితో పాటు ప్రముఖ శైవక్షేత్రాల్లో కార్తీక మాస ఏర్పాట్లు పూర్తి చేశాం. నెల రోజుల పాటు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. మూడు నాలుగేళ్ల క్రితం వచ్చిన భక్తుల అంచనాతో మరో 20 శాతానికి పైగా వస్తారని అంచనాతో ఏర్పాటు పూర్తి చేశాం. శ్రీశైలం, యాగంటి, మహానంది, ఓంకారం భక్తుల రద్దీ దృష్ట్యా అదనపు సిబ్బంది నియమించాం.

– సుధాకర్‌రెడ్డి, జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, నంద్యాల

పరిశోధనలతో మార్గ నిర్దేశం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

నంద్యాల(న్యూటౌన్): పరిశోధనలు అధ్యాపకులకు మార్గం నిర్దేశం చేస్తాయని, విద్యారంగంలోనే కాకుండా పరిశోధన రంగంలో కూడా ప్రావీణ్యత సంతరించుకొనుటకు దోహదపడుతాయని రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ కృపశంకర్ గుప్త పేర్కొన్నారు. ఆదివారం శ్రీ రామకృష్ణ పీజీ కళాశాలలో అధ్యాపకులకు పరిశోధన పత్రాల ప్రచురణలో మెళకువలు అనే అంశంపై మూడు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. ముందుగా ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. అనంతరం ఎంపవర్‌మెంట్ కాన్సెప్ట్ అండ్ అప్లికేషన్ ఇన్వెస్ట్‌మెంట్ ఫర్ సెల్ఫ్ ట్రాన్స్‌ఫర్మేషన్ అనే పుస్తకాన్ని విడుదల చేశారు. వారు మాట్లాడుతూ 1857 తిరుగుబాటులో ఝాన్సీ రాణి కీలక పాత్ర పోషించిందన్నారు. అధ్యాపకులు విద్యార్థులకు నూతన విద్యావిధానం అవలంభించడానికి పరిశోధనలు ఎంతో ఉపయోగపడుతాయని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బయ్య పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పంట పొలాలకు నీరు విడుదల



తెలుగంగ ప్రధానకాలువ 37వ బ్లాక్ వద్ద తూము ఎత్తి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

చాగలమర్రి: తెలుగంగ ప్రధాన కాలువ బ్లాక్ నెంబర్లు 33,34,37 వద్దనున్న తూములను ఎత్తి ఆదివారం పంట పొలాలకు నీటిని విడుదల చేశారు. తెలుగంగ ఈఈ శివశంకర్‌రెడ్డి, సర్పంచ్ బంగారు షరీఫ్ మాట్లాడుతూ..చింతలచెరువు గ్రామ సమీపంలోని భైరవకోన వద్దనున్న మినీ రిజర్వాయర్‌ను నింపితే తాగునీరు, వ్యవసాయబోర్లు రీచార్జ్ ఆవుతాయని రైతులు ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, రాష్ట్ర జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డికి తెలియజేశారు. వారు స్పందించి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వెలుగోడు రిజార్వాయర్ నుంచి తెలుగంగ ప్రధాన కాలువ ద్వారా 2,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయించి భైరవకోన రిజర్వాయర్‌ను నింపారు. పంట కాలువలకు వారాబందీ పద్ధతిలో పంట కాలువలకు సాగునీరు విడుదల చేస్తామని చెప్పారు. డీఈఈ వెంకటరమణ, ఏఈఈ మహమ్మద్ సలీం ఉన్నారు.

స్త్రీలకు అభయ హస్తం 'దిశ' చట్టం



కవయిత్రిని సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): దిశ చట్టంతో స్త్రీలకు రక్షణ కవచం లభించిందని ఇన్‌చార్జ్ గ్రంథాలయాధికారి శ్రీధర్ పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం స్థానిక కార్యాలయంలో దిశ చట్టం– మహిళా సాధికారితపై చర్చ కార్యక్రమం నిర్వహించారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అతివలలో నిబిడీకృతమైన అపార శక్తి సామర్థ్యాల ఆవిష్కరణ దిశగా ప్రభుత్వాలు మహిళలను ప్రోత్సహించాలన్నారు. తెలుగు భాషా సంస్కృతి వికాసానికి గ్రంథాలయాలు దోహదపడుతాయన్నారు. అనంతరం కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులను సన్మానించారు.

హిందూ ధర్మం సనాతనమైనది



నగర సంకీర్తనలో పాల్గొన్న సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): హిందూ ధర్మం ఎంతో పురాతనమైన, సనాతనమైనదని సాంస్కృతిక సంప్రదాయాలకు నిలయం మన దేశమని శ్రీశైలం రుషి సంస్కృతి ప్రచార సేవా సంస్థ, ఆధ్యాత్మిక గురువు శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. ఆదివారం హిందూ ధర్మా సమ్మేళన కార్యక్రమాన్ని పురస్కరించుకొని పట్టణంలో నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం వివేకానంద ఆడిటోరియంలో సమ్మేళన కార్యక్రమం చేపట్టారు. కొలనుభారతి శారదా పీఠం పీఠాధిపతి శ్రీ శివయోగేంద్ర సరస్వతి స్వామి మాట్లాడుతూ హిందువుల వేదసంపద అమూల్యమైనదని, వేదాంత శాస్త్రం, తత్వ శాస్త్రం, పురాణాలు, ధర్మాన్ని ఆచరించడానికి కావాల్సిన లోతైన జ్ఞానాన్ని హిందూ ధర్మశాస్త్రం విషదీకరిస్తుందన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ నంద్యాల అధ్యక్షుడు చింతలపల్లె వాసు, రామకృష్ణ డాక్టర్ రామకృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డి, సురేంద్రాజీ, మాధవరెడ్డి, దాసరి శ్రీనివాసులు, అపర్ణ దీపిక పాల్గొన్నారు.

సాహిత్యంతోనే సమాజాభివృద్ధి



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): సాహిత్యంతోనే సమాజ అభివృద్ధి మొదలవుతుందని ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ నౌమాన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎన్‌జీవో కాలనీలోని నేషనల్ పీజీ కళాశాలలో మురసం ఆధ్వర్యంలో షేక్ అబ్దుల్ సమ్మద్ రచించిన మూడు పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనంను ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని కోరారు. జాతీయ ముస్లిం రచయితల సంఘం అధ్యక్షుడు కవి కరీముల్లా మాట్లాడుతూ కవులు అణగారినవర్గాల వారిని చైతన్యం చేసేలా రచనలు చేయాలన్నారు. కవి అబ్దుల్ సమ్మద్ రచించిన అబాబీలు (క్షిపణి), అంతర్ వేదన కథలు, ఇస్లాం తరంగాల పుస్తకాలు ఎంతో మందికి ఆదర్శంగా మారుతాయన్నారు. మురసం జిల్లా అధ్యక్షుడు రఫీ, ప్రధాన కార్యదర్శి మహబూబ్‌బాషా, అరసం ముర్తుజా, రామచంద్రారావు పాల్గొన్నారు.

అందంగా..రక్షణగా



చాకరాజువేముల వద్ద మిరప పంటలో వేసిన బంతిపూలు

దొర్నిపాడు: సాధారణంగా మిరప పంటలో బంతిపూలను చూస్తుంటాం. చాలా మంది పూలకోసమే లేదా పంటకు దిష్టి తగలకుండానో, అందంగా ఉండాలనో వేస్తారని అనుకుంటారు. కానీ బంతిపూలు సాగుచేయడం వల్ల పొగాకు లద్దెపురుగు, రసంపీల్చే పురుగు, శనగపచ్చ పురుగులు పంటను ఆశించవు. బంతి పూలు లేకపోతే ఈ పురుగులు మిరప ఆకులను ఆశిస్తాయి. ఆకులను తినేస్తే కిరణజన్య సంయోగక్రియ జరగక పంట దెబ్బతింటుంది. దీంతో మిరప పంటకు రక్షణగా.. అందంగా పురుగులను ఆకర్షించేలా ఉంటుండటంతో బంతిపూలను ఎర పంటగా వేస్తారు. అయితే పచ్చని ఆకులతో నిండుగా ఉండే మిరప తోటలో పసుపు, నారింజ రంగు పూలతో తోటకు అందం తెస్తాయి. రక్షణగా, అందంగా ఉంటూ రైతన్న మేలు చేకూరుస్తుందని వ్యవసాయాధికారి సునీత పేర్కొన్నారు.

వేతనాలు పెంచాలి

నంద్యాల(న్యూటౌన్): అంగన్‌వాడీ కార్మికుల వేతనాలు పెంచాలని, చర్యలు తీసుకోకపోవతే డిసెంబర్ 8న నిరవధిక సమ్మెకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నవంబర్ 20న జిల్లా పీడీ, సీడీపీఓలకు సమ్మె నోటీసులు ఇస్తున్నామని, 23వ తేదీన అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రజా సంఘాలతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశాలు, 25 నుంచి 30వ తేదీ వరకు సెక్టార్ సమావేశాల నిర్వహిస్తామన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, వర్కర్లకు, సహాయకులకు, మినీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. విధులు నిర్వహిస్తూ మృతి చెందిన వారి కుటుంబానికి రూ. 5లక్షలు ఇచ్చి ఉద్యోగం కల్పించాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకయ్య.. రమేష్ బాబు,బాలకృష్ణ శ్రీనివాసులు, అబ్బాస్, భాస్కర్, మాణిక్యం, తిరుపాలమ్మ పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..



ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ నరసింహులును సన్మానిస్తున్న ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో ఆదివారం పలువురు ప్రముఖులు పూజలు నిర్వహించారు. ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ నరసింహారావు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి వారికి స్వాగతం పలికి పూజలు నిర్వహింపజేశారు. అలాగే కర్నూలు జిల్లా న్యాయమూర్తి ఎన్. శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జీలు రాధారాణి, వి.ఆదినారాయణ, ఏడీజే జి.అర్చన పూజలు చేపట్టారు. స్థానిక అలంకార మండపంలో వారికి శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేయించారు. అలాగే.. సీఐడీ ఎస్పీ నగేష్, కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు. దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఇన్‌స్పెక్టర్ ముడియం చంద్రశేఖర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ మేరకు వారు శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని పూజలు చేపట్టారు. అనంతరం స్థానిక యాగశాలలో వారికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేయించారు. వారి వెంట హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



సీఐడీ ఎస్పీ నగేష్‌కు స్వామి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి



ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నంద్యాల(అర్బన్): స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 106వ జయంతిని ఘనంగా నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతలయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చింతలయ్య మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనార్టీల అభ్యున్నతికి ఆమె చేసిన సేవలు మరువలేనివన్నారు. సలాం, ఆనంద్, ఎస్‌వైడీ ప్రసాద్, ఫారూక్, అబ్దుల్లా, అహమ్మద్ పాల్గొన్నారు.



ఇందిరాగాంధీ చిత్ర పటానికి పూలమాలల వేస్తున్న దృశ్యం

చాగలమర్రి: స్థానిక ప్రభుత్వ శాఖా గ్రథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆదివారం లైబ్రేరియన్ రామచంద్రుడు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు చెస్, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. అలాగే స్థానిక భారతీ విద్యా మందిరం పాఠశాల విద్యార్థులకు నృత్య పోటీలు ఏర్పాటు చేశారు.

జగనన్నతోనే సంక్షేమ పథకాల కొనసాగింపు



కోటగడ్డ వీధిలో మా నమ్మకం నువ్వే బ్రోచర్ అందజేస్తున్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు

చాగలమర్రి: వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనన్నను సీఎంగా గెలిపించుకుంటేనే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగుతుందని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మూడో సచివాలయ పరిధిలోనున్న 12,13 వార్డులలో సచివాలయ కన్వీనర్లు క్రిష్ణంపల్లె మహబూబ్‌బాషా, కొత్తపల్లె హుసేన్‌సా, బి.మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. వారు ప్రతి ఇంటిని సందర్శించి మా నమ్మకం నువ్వే జగన్ బుక్‌లెట్ అందజేసి వారు పొందిన లబ్ధిని వివరించారు. గృహసారథులు డి.గౌస్, లాల్‌బాషా, పీరమ్మగారి మహమ్మద్‌రఫీ, బి.ఖలందర్, షేక్.నాయబ్‌రసూల్ పాల్గొన్నారు.

నేడు

నేడు 'పల్లెకు పోదాం'

శిరివెళ్ల: ఈ నెల 20వ తేదీన మండలంలోని గోవిందపల్లెలో గ్రామ సచివాలయంలో పల్లెకు పోదాం గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం ప్రజలకు అందించిన పథకాల వివరణ, సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరణ జరుగుతుందన్నారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలని సూచించారు.

ఉయ్యాలవాడ : మండలంలోని మాయలూరు గ్రామ సచివాలయంలో సోమవారం సాయంత్రం 3 గంటలకు పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు సంబంధించిన డిస్‌ప్లే బోర్డులను ఆవిష్కరించనున్నట్లు వెల్లడించారు. అనంతరం ఏర్పాటు చేసే గ్రామసభలో సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని చెప్పారు. ప్రజా ప్రతినిధులు, మండలస్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

'గడప గడపకు మన ప్రభుత్వం'

రుద్రవరం: మండలంలోని శ్రీరంగాపురం గ్రామ సచివాలయ పరిధిలో సోమవారం ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రాంభించి సాయంత్రం వరకు టీ.కొట్టాల, శ్రీరంగాపురం గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతారని, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొనాలని కోరారు.

స్పందన

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రవికుమార్ ఆదివారం తెలిపారు. గ్రామ సచివాలయాల్లో ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రామ సచివాలయాల్ల పరిధిలో సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోతే మండల కేంద్రంలో జరిగే కార్యక్రమానికి హాజరై అర్జీలు సమర్పించాలని కోరారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటిపూట ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం రోజుల పాటు కొండుపల్లె, ఇంజేడు, అక్కంపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 3 గంటల వరకు, మాయలూరు, సుద్దమల్ల ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని ఏఈ వివరించారు.

గ్రాసానికి డిమాండ్

- వాహనాల్లో ఇతర జిల్లాలకు తరలింపు
- ఎకరా గడ్డి రూ.3వేలు
- చుట్టలుగా కట్టి ఇతర జిల్లాలకు తరలించి విక్రయిస్తున్న వ్యాపారులు



తిప్పారెడ్డిపల్లె వద్ద గ్రాసాన్ని చుట్టలుగా చుడుతున్న ట్రాక్టర్



ముకుందాపురం వద్ద గ్రాసం చుట్టలను రోడ్డు పైకి మోసుకెళ్తున్న కూలీలు

రుద్రవరం: మండలంలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ రైతులు బోరు మోటార్లు, చెరువులు, తెలుగుగంగ కాల్వల కింద పంటను పండించారు. వారి శ్రమకు తగ్గట్టుగానే దిగు బడులు ఆశాజనకంగా వస్తున్నాయి. ఎకరాకు 30 నుంచి 40 బస్తాల వరకు దిగుబడులు రావడం, 70కేజీల బస్తా రూ.2వేలు పలుకుతుండటంతో లాభాలు వస్తున్నాయని పలువురు రైతులు పేర్కొంటున్నారు. కాగా..నంద్యాల జిల్లాతో పాటు కర్నూలు, వైఎస్సార్,ప్రకాశం వంటి జిల్లాల్లో వరి పంట తక్కువగా ఉండటంతో అక్కడ పశు గ్రాసం కొరత ఏర్పడింది. ఇక్కడ పంట విస్తారంగా సాగైన విషయం తెలుసుకొని పలువురు వ్యాపారులు రుద్రవరం మండలంలోని తిప్పారెడ్డిపల్లె,నర్సాపురం, ఆలమూరు,చిత్రేనిపల్లె,ముకుందాపురం,హరినగరం,తండా తదితర గ్రామాల పరిధిలో ఎకరంలోని గ్రాసాన్ని రూ.3వేల ప్రకారం రైతుల నుంచి కొనుగోలు చేసి చుట్టలుగా కట్టిస్తున్నారు. వాటిని వాహనాల్లో ఇతర జిల్లాలకు తరలించి అక్కడ ఒక్కో చుట్ట రూ.200కు పైగా విక్రయిస్తున్నారు. నిత్యం పదుల సంఖ్యల వాహనాల్లో వరి గడ్డి ఇతర జిల్లాలకు తరలిపోతుంది.



చిత్రేనిపల్లె వద్ద ట్రాక్టర్లలో తరలిస్తున్న గ్రాసం చుట్టలు